క్లుప్తంగా

సుబ్బారాయుడిని దర్శించుకున్న డీఎన్నార్



ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరు పాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ షష్ఠి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకుంటున్నారు. ఇందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), వీరకుమారి దంపతులు సుబ్బారాయుడిని దర్శించుకున్నారు. అనంతరం సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, బొంగురవి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు స్వామి వారి చిత్రపటంతో డీఎన్నార్ దంపతులను సత్కరించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వరరావు దంపతులు, పార్టీ రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, వైస్ ఎంపీపీ రాచూరి రాధ, సర్పంచ్‌లు సుగుణరావు, రామరాజు, ఎంపీటీసీ సభ్యుడు ఏసుబాబు, కొండ, సురేష్, వెంకటరమణ, చంటి తదితరులు పాల్గొన్నారు.

గోకులాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జమీగొల్వేపల్లి(పామర్రు): గోకులాల పథకాలను రైతులు సద్వినియోగంచేసుకుని లబ్ధి పొందాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలో గ్రామానికి మంజూరైన ఏడు గోశాలలను(గోకులాలను) సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకులాల్లో ప్రస్తుతం జరుగుతున్న పనులను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయవరపు శాంతకుమారి, వైస్ ఎంపీపీ అరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు అరవింద్, రత్నకుమారి, ఫీల్డు అసిస్టెంట్ సుబ్బారావు పాల్గొన్నారు.

రంగా విగ్రహాల ఆవిష్కరణ



పామర్రు: వంగవీటి మోహనరంగా పేదలకు చేసిన సేవలు నిరుపమానమైనవని ఆయన కుమారుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని పెదమద్దాలి, పామర్రులో తాడిశెట్టి నాగేశ్వరరావు బ్రదర్స్ అండ్ సన్స్, పెదమద్దాలి రాధారంగ మిత్ర మండలి సౌజన్యంతో దివంగత నాయకుడు వంగవీటి మోహనరంగా విగ్రహాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ఎనలేని సేవలను అందించిన మహనీయుడు రంగా అని అన్నారు. తనదైన శైలిలో పేదలకు అండగా ఉంటూ వారి ఆదరణ పొందారన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ రంగా చేతల మనిషి అని అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం ప్రాణత్యాగం చేసిన వ్యక్తి వంగవీటి రంగా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, కాగిత కృష్ణ ప్రసాద్, రాధా రంగా మిత్ర మండలి అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీనివాస్, పామర్రు జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, స్థానికులు బ్రహ్మనాయుడు, వంగవీటి శ్రీనివాసప్రసాద్, పామర్రు రాధా రంగా మిత్ర మండలి యూత్ పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా పరిగణించాలి

కైకలూరు: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాను కల్పించాలని కోరుతూ దళిత సంఘటిత శక్తి ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి బైక్ ర్యాలీగా వెళ్లి తాలూకా సెంటర్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పామర్రు–దిగమర్రు జాతీయ రహదారిలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల్లోని అన్ని కులాలకు ఎస్సీ హోదాను కల్పించాలన్నారు. మతం ప్రాతిపదికన కాకుండా కులం పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లు వర్తింపజేయాలని కోరారు. దళిత సంఘటిత శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు కుర్రేళ్ల కిషోర్, కలిదిండి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దాసరి అబ్రహం లింకన్, దాసి ఏసుబాబు, ఎంపీటీసీ సభ్యుడు కొండయ్య, న్యాయవాదులు లక్ష్మణరావు, రత్నరాజు, భాస్కరరావు, ఆనంద్, అంబేడ్కర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

పమిడిముక్కల: మండలంలోని తాడంకి చెన్నకేశవ స్వామి ఆలయంలో సోమవారం జరిగిన అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత చెన్నకేశవ స్వామిని దర్శించుకుని ఎమ్మెల్యే కుమార్ రాజా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కా శ్రీనివాసరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా తిరుప్పావై సేవ

కలిదిండి(కైకలూరు): అపర భద్రాద్రిగా పేరుగాంచిన తాడినాడ సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు తీర్థబిందె నీటితో స్వామికి స్నపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సుప్రభాత సేవ, నిత్య అర్చన, తిరుప్పావై సేవ, పాసురం విన్నపం, తీర్థప్రసాదాల వినియోగం చేశారు. శ్రీమన్నారాయణ గోష్ఠి సభ్యుల పారాయణ నిర్వహించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రజారోగ్యానికి తూట్లు

ఆహార భద్రత, నియంత్రణ చట్టం ప్రకారం ఆహార పదార్థాల్లో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రంగులను వాడకూడదనే నిబంధనలను వ్యాపారులు తుంగలో తొక్కుతున్నారు. ఆహార పదార్థాల్లో ఇష్టారాజ్యంగా రంగులు వాడుతూ ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు కొందరు వ్యాపారులు ఆహార పదార్థాల్లో అడ్డమైన రంగులు కలిపి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● గుడివాడలో నిబంధనలు గాలికి ● జోరుగా కల్తీ ఆహార విక్రయం



కల్తీ ఆహార విక్రయం



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో హాని కలిగించే రంగు పూసిన చికెన్

గుడివాడరూరల్: గుడివాడలో విచ్చలవిడిగా కల్తీ ఆహార దందా జరుగుతున్నా అధికారులు మౌనంగా ఉండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని బిర్యానీ పాయింట్లు, చికెన్ పకోడీ దుకాణాలు, మిఠాయి దుకాణాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు రోజురోజుకు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రోడ్లపై ఎక్కడ చూసినా బిర్యానీ పాయింట్లు దర్శనమిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యానికి హానీ కలిగించకుండా తయారీ చేయాల్సిన ఆహారంలో అడ్డగోలుగా నిబంధనలు అతిక్రమించి ఆరోగ్యానికి హానికలిగించే నూనెలు, రంగులు, మసాలాలు కలిపి ప్రజలకు అమ్మేస్తున్నారు. పలు హోటల్స్, రెస్టారెంట్లలో రోజుల తరబడి నిల్వ ఉంచిన మాంసాన్ని వాడుతున్నారు. ఫ్రీజ్‌ల్లో నిల్వ ఉంచి బిర్యానీలను విక్రయిస్తుండటంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే పరిస్థితి తలెత్తింది. ముఖ్యంగా నూనెల విషయంలో వ్యాపారులు స్వార్థంగా ఆలోచించి ప్రజల ఆరోగ్యానికి తూట్లు పొడుస్తున్నారు. చికెన్ పకోడి తదితరాల్లో రోజుల తరబడి వాడిన నూనెనే వాడి తయారు చేస్తున్నారు. ఫలితంగా కొనుగోలు చేసిన ప్రజలకు విషతుల్యమైన ఆహారం వలన ప్రాణానికి ముప్పు కలిగించే వ్యాధులు సంభవించే ప్రమాదం ఉంది. చికెన్ వాసన రాకుండా వెనిగర్‌తో కడుగుతున్నారు. తక్కువ ధరకే ఇంటిల్లిపాదికి బిర్యానీ వస్తుండడంతో ప్రజలు ఆరోగ్యాన్ని విస్మరించి కొనుగోలు చేస్తున్నారు.

చికెన్ పకోడీ దుకాణాల్లోనూ..

పట్టణంలో ప్రతి సెంటర్‌లో ఇబ్బడిముబ్బడిగా చికెన్ పకోడీ దుకాణాలు వెలిశాయి. వాటిలో చికెన్ పకోడీతో పాటు చికెన్ లెగ్ పీసులు ఆకర్షణీయంగా కనిపించేందుకు రంగులను పరిమితికి మించి కలుపుతున్నారు. పదేపదే మరిగించిన నూనెల్లోనే వేయిస్తున్నారు. మరిగించిన నూనెను ఎక్కువసార్లు వినియోగిస్తే క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నా వ్యాపారులు లెక్కచేయడం లేదు. రూ.50 నుంచి రూ.100కే పావు కిలో చికెన్ పకోడి ఇస్తుండటంతో ప్రజలు విపరీతంగా కొనుగోలు చేస్తున్నారు. కొందరు కర్రీస్ పాయింట్ల నిర్వాహకులు సైతం ఇదే పంథాను అనుసరిస్తున్నారు. సాంబారు, దొండకాయ వేపుడు, బంగాళాదుంప కూరల్లోనూ పరిమితికి మించి రంగులు కలిపి విక్రయిస్తున్నారు.

బేకరీల్లోనూ ఇదే పరిస్థితి

పట్టణంలోని పలు బేకరీల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కేక్‌లు, స్వీట్లలో మోతాదుకు మించి రంగులు వినియోగిస్తున్నారు. చిన్న పిల్లలను ఆకట్టుకునేలా కూల్ కేక్‌లు, కొబ్బరి కేక్‌లు అంటూ రంగులతో నింపేస్తున్నారు. వీటిని తిన్న తరువాత నోరంతా రంగు మారిపోవడంతో పాటు నోరు, పెదాలు దురద పుట్టడం వంటి సమస్యలు కూడా వస్తున్నాయి. చిన్న పిల్లల పుట్టిన రోజు కేకులకు కూడా విపరీతంగా రంగులు వినియోగిస్తున్నారు. వీటితో పాటు ఐస్‌క్రీమ్‌లు, ఫాలుదా తదితర శీతల పానియాల్లో కూడా నాణ్యతలేని, నిషేధిత రంగులు, రసాయనాలు వినియోగిస్తున్నారు.

తనిఖీలు శూన్యం

ఆహారభద్రత నియంత్రణ శాఖ అధికారులు తరచూ ఆహార దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. పరిమితికి మించి రంగులతో తయారు చేసిన ఆహార పదార్థాలను, నిల్వ ఉంచిన మాంసాలను గుర్తించి ప్రజల ఆరోగ్యానికి చేటు చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి. గుడివాడ పట్టణంలో మాత్రం అధికారులు విధులను గాలికి వదిలేశారు. ఏ రోజు ఎక్కడా పట్టణంలో తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఆహారాన్ని కలుషితం చేసి ప్రజలకు అమ్మేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలనే పట్టణంలోని ఆహార తనిఖీ శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పట్టణంలో విచ్చలవిడిగా ప్రజల ఆరోగ్యానికి తూట్లు పొడుస్తున్న వ్యాపారులపై కొరడా ఝుళిపించాలని, విధుల్లో అలసత్వంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గుడివాడలోని ఓ రెస్టారెంట్‌లో ఫ్రీజ్‌లో నిల్వ ఉంచిన మాంసం

ప్రజల ఆరోగ్యానికి చిల్లులు

అధునాతనమైన ఫర్నిచర్, వినియోగదారులను ఆకర్షించే భవనాలు రెస్టారెంట్లలో కళ్లు చెదిరే ఆహారపు ధరలు పైన పటారం, లోన లొటారంలా ఉంది పట్టణంలోని రెస్టారెంట్ల పరిస్థితి. భవనాల్లో చూస్తే డాబు ఆహారంలో మాత్రం కన్పించడం లేదు. నీట్‌గా కన్పించే సిబ్బంది, ఫర్నిచర్‌లో చూపే శ్రద్ధ ఆహారంలో మాత్రం రెస్టారెంట్ల యజమానులు చూపడం లేదు. ఆహారంలో వాడే మటన్, చికెన్, ప్రాన్స్ రోజుల తరబడి ఫ్రీజ్‌ల్లో నిల్వ ఉంచి ఆహారం తయారు చేస్తున్నారు. దీంతో ప్రజల ఆరోగ్యానికి చిల్లులు పడుతున్నాయి. డబ్బుతో పాటు ఆరోగ్యాన్ని సైతం పోగొట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

జాగ్రత్తలు పాటించాలి



ఫాస్ట్‌ఫుడ్ అమ్మకాలు చేసేవారు ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా ఉండడానికి రంగుల కోసం మెటానియల్ ఎల్లో, టార్‌ట్రాజిన్ అనే రసాయనాలు, రుచి కోసం టేస్టింగ్ సాల్ట్‌ను వాడుతున్నారు. వీటిని వాడకూడదు. వీటి వల్ల క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ప్రజలు ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యంగా ఉంటూ ఫాస్ట్‌ఫుడ్‌ను సరదాగా తినేస్తున్నారు. ప్రజలు రంగులు కలిపిన ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆహార పదార్థాల్లో పరిమితికి మించి రంగులను వాడితే చర్యలు తీసుకుంటాం. వాటిని కట్టడి చేసేందుకు తనిఖీలు చేపడతాం.

– ఎం.శ్రీనివాసరావు, ఫుడ్ ఆఫీసర్, గుడివాడ

నేడు పెన్షనర్ల దినోత్సవం

గుడివాడ టౌన్: రాష్ట్ర పెన్షనర్ల సంఘం గుడివాడ శాఖ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు భవిరి శంకర్‌నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 75 ఏళ్లు నిండిన 47 మంది పెన్షనర్లకు సత్కారం ఉంటుందని తెలిపారు.

కైకలూరులో..

కైకలూరు: జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా తాలూకా సెంటర్‌లోని పెన్షనర్ల కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు అసోషియేషన్ అధ్యక్షుడు గుత్తా వేంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. కైకలూరు సబ్ ట్రెజరీ పరిధిలోని పెన్షనర్లందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

పోలీస్‌స్టేషన్‌కు ప్రశ్నపత్రాలు

నందివాడ: సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపర్‌కు సంబంధించి ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు గల ప్రశ్నపత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్లో భద్రపరిచారు. కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు నందివాడ ఎంఈఓ డేవిడ్ రత్నరాజు, పర్యవేక్షణలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అథ్లెటిక్స్‌లో మురళీకృష్ణ ప్రతిభ



పామర్రు: స్థానిక జెడ్పీ హైస్కూల్ పీడీ జీ మురళీ ప్రతిభకనబర్చి విజేతగా నిలిచారు. ఈ నెల 14,15 తేదీలలో కృష్ణా జిల్లా గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో జి.మురళీకృష్ణ షాట్‌పుట్‌లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డుమెడల్ సాధించారు. అంతే కాకుండా డిస్కస్‌త్రోలో ఉత్తమప్రతిభ కనబర్చి గోల్డు మెడల్, జావెలిన్ త్రోలో బ్రాంజ్ మెడల్స్‌ను సాధించారు. ఈ పోటీల్లో మూడు మెడల్స్‌ను సాధించినందుకు హైస్కూల్ హెచ్‌ఎం ఇందిరాదేవి, ఉపాధ్యాయులు మురళీని అభినందించారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం



పామర్రులో గోదాదేవికి అభిషేకం



గుడివాడలో తీర్థపు బిందెతో ప్రదర్శన



గుడ్లవల్లేరు వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తుల పూజలు



గుడ్లవల్లేరులో సర్వాలంకారభూషితుడిగా దర్శనమిచ్చిన సత్యదేవుడు

పామర్రు: స్థానిక విష్ణాలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని భక్తులు తాళ్లూరి శివరామకృష్ణయ్య కుమారుడు పూర్ణచంద్రరావు బాలారత్నం దంపతుల ఆధ్వర్యంలో సోమవారం విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గోదాదేవి రంగనాథస్వామి విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలను చేశారు. మండలంలోని జమీదగ్గుమిల్లి గ్రామంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత పూజలను నిర్వహించారు.

నగర సంకీర్తన

మండవల్లి: ధనుర్మాసం పురస్కరించుకుని సోమవారం మండవల్లిలోని షిర్డీసాయిబాబా మందిరంలో నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు ఇంటింటికీ వెళ్లి బిక్ష స్వీకరించారు. ఈ నెల 17వ తేదీన ఇండియన్ బ్యాంక్, మెయిన్‌రోడ్‌లో నగర సంకీర్తన నిర్వహించనున్నట్లు గుడివాడ చిట్టిబాబు తెలిపారు. బండారు వెంకయ్య, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలోని ప్రధాన ఆలయాల్లో ధనుర్మాస పూజలను సోమవారం భక్తిప్రపత్తులతో ప్రారంభించారు. గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం, స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం, విన్నకోట శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలను చేపట్టారు.

పెదముత్తేవిలో..

పెదముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలంలోని పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమంలో ముముక్షుజన మహాపీఠాధిపతి ముత్తెవిగౌరకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం వేకువజామున ధనుర్మాస వేడుకలను ప్రారంభించారు. తొలుత నగర సంకీర్తనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అలాగే కూచిపూడి రుక్మిణీ సత్యభామ సమేత శ్రీరాజగోపాలస్వామి మందిరం, కూచిపూడి పెదపూడి రామాలయాలు తదితర ఆలయాల్లో వేడుకలు ప్రారంభమయ్యాయి.

గుడివాడలో..

గుడివాడ టౌన్: ధనుర్మాస మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక జగన్నాథపురం పాటి మీద గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వేద పండితులు అప్పలాచార్యులు ఉదయం తీర్థపుబిందె తీసుకుని ఆలయ ప్రదర్శనతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఆలయ అధికారి కె. వేణుగోపాలరావు ధనుర్మాసకర్త సీహెచ్ ఇందిరా రమణారావు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి



గ్రామ మ్యాప్‌లో వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

మొవ్వ: మండలంలోని వేములమడలో మంగళవారం నుంచి ప్రారంభమయ్యే రీ సర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (ఉయ్యూరు) శివరామప్రసాద్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. రీ సర్వే ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని చేసిన ఎంపికలో భాగంగా వేములమడలో నిర్వహించే సర్వేకు ఐదు బృందాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఒక్కొక్క బృందంలో వీఆర్వో, ఇద్దరు గ్రామ సర్వేయర్లు, వీఆర్ఏ ఉంటారని పేర్కొన్నారు. తొలుత ఆయన మండల తహసీల్దార్ కే మస్తాన్, మండల సర్వేయర్ ఏ కిషోర్‌బాబు, వేములమడ వీఆర్వో జే రాఘవులు, సర్వేయర్ జి.తేజశ్రీ తదితరులతో సమావేశమై ఫీల్డ్ బుక్, గ్రామ మ్యాపు ద్వారా పూర్తి వివరాలను సేకరించారు.

ఖోఖో పోటీల్లో ఏఎన్నార్ విద్యార్థుల ప్రతిభ



విజేతలతో కళాశాల యాజమాన్యం

గుడివాడ టౌన్: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల ఖోఖో పోటీల్లో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచారని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజీఎస్ కుమార్ తెలిపారు. సోమవారం కళాశాల యాజమాన్యం విజేతలను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కృష్ణా యూనివర్సిటీ ఆధ్వర్యంలో పామర్రు డిగ్రీ కళాశాల్లో జరిగిన ఈ పోటీల్లో తమ విద్యార్థులు ప్రథమస్థానం కైవసం చేసుకున్నారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభను కనబర్చిన సీహెచ్ వీవీఎస్ గణేష్, పి. నవీన్‌కుమార్, జి. భార్గవ్, కె. శివరామ్, కె.జంపయ్య సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. త్వరలో తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో వీరు కృష్ణా యూనివర్సిటీ తరపున ఆడతారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, పీడీ వీర్ల గోపి పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించుకోండి

పమిడిముక్కల: గ్రామసభలను సద్వినియోగం చేసుకుని, భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని ఎంపీపీ కాసాని వేద సుప్రజ పేర్కొన్నారు. వీరంకిలో సోమవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఐదు అర్జీలు అందాయని, ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు. సర్పంచ్ కాసాని నాగేశ్వరమ్మ, రీసర్వే డీటీ యేసుపాదం పాల్గొన్నారు.

ఎస్సీ శ్మశాన వాటికకు స్థలం ఇప్పించాలి

నాగాపురం(పెదపారుపూడి): పెదపారుపూడి మండలం నాగాపురంలో ఎస్సీ శ్మశాన వాటికకు స్థలం ఇప్పించాలని సర్పంచ్ సుబ్రహ్మణ్యం కోరారు. నాగాపురం శివారు సోమర్పాడులో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్థానికులతో కలిసి సర్పంచ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. స్పందించిన తహసీల్దార్ వై.రంగారావు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పెంజెంద్రలో అర్జీల స్వీకరణ

గుడ్లవల్లేరు: పెంజెంద్ర రెవెన్యూ సదస్సులో అర్జీలను అధికారులు స్వీకరించారు. స్థానిక పంచాయతీ ఆవరణలో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఎంఆర్ఐ శివకుమార్, మండల సర్వేయరు పర్వీన్ సుల్తానా, వీఆర్వో రవి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శివప్రసాద్ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: రైతుల భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి కె.శ్రీనివాస్, తహసీల్దార్ జేఎస్ సుభాని తెలిపారు. వాడవల్లిలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో వారు మాట్లాడారు. భూసమస్యల కారణంగా రైతుల మధ్య తరచూ విభేదాలు వస్తున్నందున, వీటిని పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సులో వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

హిందూ మత సంరక్షణే ధ్యేయం

గుడ్లవల్లేరు: హిందూ మత సంరక్షణే ధ్యేయంగా యువకులంతా కృషి చేయాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా నాయకుడు పల్నాటి వెంకటస్వామి నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం గుడ్లవల్లేరులోని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్‌కుమార్ నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ మత సంక్షరక్షణ కోసం వచ్చే నెల 5వ తేదీన విజయవాడలోని కేసరపల్లి వద్ద హిందూ శంఖారావాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దావులూరి సురేంద్రబాబు, నాయకులు వంగివరపు నవీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కానుకొల్లులో సీసీ రోడ్డు పనులు

మండవల్లి: కానుకొల్లు ఎస్సీ ఏరియాలో పంచాయతీ నిధులతో సోమవారం సీసీ రోడ్డు పనులు చేపట్టారు. 42 మీటర్ల రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు సర్పంచ్ నాగదాసి థామస్ తెలిపారు. పీఆర్ ఏఈ నాని, ఎంపీటీసీ మీనాకుమారి, ఉపసర్పంచ్ నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

పమిడిముక్కల: గ్రామ పంచాయతీలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల అధికారులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పేదిరిక నిర్మూలన, ఆరోగ్యవంతమైన సమాజం, బాలహిత, సమృద్ధిగా నీరు, పచ్చదనం–పరిశుభ్రత, మౌలిక వసతులు సమృద్ధిగా గల గ్రామం, సామాజిక న్యాయం, సాంఘిక భద్రత, సుపరిపాలన, మహిళా సాధికారత లక్ష్యాలను విపులంగా వివరించారు. ప్రతి పంచాయతీ ఏదో ఒక లక్ష్యాన్ని ఎంపిక చేసుకుని నూరుశాతం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్, విద్యుత్ ఏఈలు పృథ్వీరాజ్, శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో కైకలూరుకు 10 పతకాలు



అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

కైకలూరు: రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ షిప్ పోటీలు శని, ఆదివారాల్లో కృష్ణా జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో జరిగాయి. కైకలూరు నుంచి పలువురు వివిధ క్రీడా అంశాల్లో పోటీ పడ్డారు. వీరిలో ఎంఎస్.రాజు 5 కేఎం, 1500, 8,00 మీటర్ల పరుగు పందెంలో మూడు స్వర్ణ పతకాలు సాధించారు. అదేవిధంగా కైకలూరు మాజీ సర్పంచ్ తెంటు నాగేశ్వరరావు జావెలన్ త్రో, 5 కేఎం వాకింగ్‌లో రజిత పతకాలు, లాంగ్ జంప్‌తో కాంస్య పతకం పొందారు. కైకలూరు వార్డు సభ్యుడు, న్యాయవాది ఎండీ. గాలిబ్‌బాబు 1,500 మీటర్ల పరుగులో రజిత పతకం, 100 మీటర్ల పరుగు, షాట్ పుట్‌లో కాంస్య పతకం సాధించారు. పొంటెన్ జావిలిన్ త్రోలో కాసంస్య పతకం సాధించారు. పతకాలను సాధించిన వారిని సోమవారం కైకలూరు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిమ్మగడ్డ నాగభూషణం హైస్కూల్ గ్రౌండ్‌లో వాకర్స్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్, సభ్యులు కారి శరత్‌బాబు సన్మానించారు.